స్వాగతం

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ స్వాగతం పలికారు . ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా మంత్రి కేటీఆర్ ఆశీస్సులను తీసుకున్నారు. **- అబిడ్స్, అక్టోబర్ 28**

సన్మానం

నగరానికి విచ్చేసిన ప్రముఖ సంఘ సేవకుడు పుష్పేంద్ర కుల్‌శ్రేష్టను జగన్నాథ్ మందిర్‌లో సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావు నేతృత్వంలో బజరంగ్ సేన ప్రతినిధులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్ గుప్తా, ఈకే బాజ్‌పేయ్, రజిని, శ్రీరామోజు నందకిశోర్ అగర్వాల్, అభినయ తివారి, వీరేందర్, కె. రాఘవ కుమార్, రామేశ్వర్ మిశ్రా, హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. **- అబిడ్స్, అక్టోబర్ 28**

కుస్తీ పోటీలు ప్రారంభం

ధూల్‌పేటలో శనివారం వీర్ లోదేశ్వర్ రవీందర్ పహిల్వాన్ కేసరి పోటీలను ప్రారంభించారు. పర్వేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలను మెట్టు సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. దేశంలో కుస్తీ పోటీలకు ప్రాధాన్యత ఉందని తెలిపారు. ప్రధానంగా ధూల్‌పేట్ ప్రాంతంలో కుస్తీ పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు గాను తరచు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొన్నారు. **- అబిడ్స్, అక్టోబర్ 28**

దివ్యాంగుల పింఛన్ పెంచడం సంతోషకరం

దివ్యాంగుల పెన్షన్ పెంచడం సంతోషకరం. సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంక్షేమానికి అనేక పథకాలను తీసుకు వచ్చారు. పెన్షన్‌ను పెంచడంతో రాష్ట్రంలోని దివ్యాంగులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వందలలో పెన్షన్ వచ్చేది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా పెంచడంతో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. **- పి.పద్మ గౌడ్**

నిర్వాహకులు సంస్కృతిక సేవ వారధులు

చిమ్మపూడి ఫౌండేషన్ వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 28 : చిమ్మపూడి ఫౌండేషన్ చతుర్థ వార్షికోత్సవం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత, సాహిత్య, సాంస్కృతిక, నృత్య కళాకారులను ప్రోత్సహిస్తూనే సామాజిక సేవలో దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్నందుకు గాను పలు సంస్థల నిర్వాహకులు డాక్టర్ ఎం.కె రాము, డాక్టర్ వంశీరామరాజు, మద్దాలి రఘురామ్, ఈ. భవాని, గుదిబండ వెంకటరెడ్డి, ఆచార్య ఫణీంద్ర, వేమరాజు విజయకుమార్, కె.రామాచారి, కె.జ్ఞానకుమార్‌కు సేవా పురస్కారాలు అందజేశారు.

దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ పాలకుర్తి మధుసూదన రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి, బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహనరావు, సాహితీవేత్తలు సుధామ, జి. సత్యవాణి, బి. యదుమోహన్, సీహెచ్ శ్రీరామమూర్తి పాల్గొని పురస్కార గ్రహీతల సేవలను కొనియాడారు. పత్రిక సేవా పురస్కారాలతో సీనియర్ పాత్రికేయులు బైసా దేవదాసు, పొత్తూరి సుబ్బారావు, డాక్టర్ మహ్మద్ రఫీను సన్మానించారు.. ఈ సందర్భంగా పేరిణి ప్రకాశ్ శిష్య బృందం ప్రదర్శించిన పేరిణి నాట్య ప్రదర్శన విశేషంగా అలరించింది.

హార్టికల్చర్ యూనిట్ కార్యవర్గం ఎన్నిక ఏకగీవ్రం

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ముజీబ్‌హుస్సేనీని సన్మానిస్తున్న టీఎన్జీవో గవర్నమెంట్ హార్టికల్చర్ యూనిట్ కార్యవర్గం

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 28 : టీఎన్జీవో గవర్నమెంట్ హార్టికల్చర్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. శనివారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో యూనిట్ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా శాఖ ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్ వ్యవహరించారు. మూడేండ్ల వ్యవధికి గాను జరిగిన ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యుల వివరాలను వారు వెల్లడించారు.టీఎన్జీవో గవర్నమెంట్ హార్టికల్చర్ యూనిట్ అధ్యక్షుడిగా మహమ్మద్ మోయినుద్దీన్, ఉపాధ్యక్షులుగా అహ్మద్ ఖాన్, డి.అనురాధ, కార్యదర్శిగా ఈ.జ్యోతి, సంయుక్త కార్యదర్శులుగా జి.సందీప్, మహమ్మద్ సాదత్ వికార్, కోశాధికారిగా కె.పరుశురాములు, కార్యవర్గ సభ్యులుగా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ నూతనంగా ఎన్నికైన హార్టికల్చర్ యూనిట్ కార్యవర్గానికి నియామకపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా యూనిట్ నూతన కార్యవర్గం ముజీబ్‌హుస్సేనీతో పాటు ఎన్నికల అధికారులు కేఆర్.రాజ్ కుమార్, కురాడి శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించారు.

ఘనంగా నిమజ్జనం

ఇసామియా బజార్‌లో ప్రతిష్ఠించిన శ్రీ నాగశక్తి భద్రకాళి మాత విగ్రహం

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 28 : ఇసామియా బజార్‌లో ప్రతిష్ఠించి 13 రోజుల పాటు భక్తుల నీరాజలను అందుకున్న 55 అడుగుల ఎకో ఫ్రెండ్లీ అతి పెద్ద అమ్మవారి విగ్రహాన్ని శనివారం శోభాయాత్ర అనంతరం నిమజ్జనం చేశారు. ఈ యేడాది శ్రీ నాగశక్తి భద్రకాళి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశామని శ్రీ నవదుర్గా నవరాత్రి ఉత్సవ సమితి చైర్మన్, తెలంగాణ గంగపుత్ర ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ చైర్మన్ గులాబ్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

శోభాయాత్ర..

ఇసామియా బజార్‌లో నెలకొల్పిన అతి పెద్ద అమ్మవారి విగ్రహానికి శనివారం ఉత్సవ సమితి చైర్మన్ గులాబ్ శ్రీనివాస్ మహా హారతితో పూజలను నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తరలించేందుకు ప్రారంభించారు. ఈ నిమజ్జన వేడుకల్లో భాగంగా నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది.ఈ శోభాయాత్ర ఇసామియా బజార్‌లోని టెలివిజన్ గల్లీ నుండి కోఠి ప్రధాన రహదారి శివనాథ్ మిఠాయి భండార్ మీదుగా చాదర్‌ఘాట్‌లోని విక్టోరియా ప్లే గ్రౌండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి పైపులతో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 150 మంది కళాకారులు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు.

ప్రకాశ్ గౌడ్ గెలుపునకు సైనికుల్లా పనిచేస్తాం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ గెలుపునకు సైనికుల్లా పనిచేస్తామని సుల్తాన్‌పల్లి గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దండు ఇస్తారి తెలిపారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009 నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాశ్ గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. నాలుగోసారి ప్రకాశ్ గౌడ్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో తెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వార్డు సభ్యుడు మాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, కావలి ఈశ్వర్, సిద్ధుఖ్‌బాయి తదితరులు ఉన్నారు. **- శంషాబాద్ రూరల్, అక్టోబర్ 28**

1న మహిళలతో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో

జై మహాభారత్ బహిరంగ సభ

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జై మహాభారత్ పార్టీ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని జై మహాభారత్ జాతీయ అధ్యక్షుడు భగవాన్ శ్రీ అనంతవిష్ణు (ప్రభు) చెప్పారు. శనివారం రవీంద్రభారతి పక్కన ఉన్న పార్టీ జాతీయ కేంద్ర కార్యాలయంలో రెండో విడుత అభ్యర్థులను ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 1 న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 50 వేల మంది మహిళలలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం రెండో విడుత మహిళా అభ్యర్థులకు బీ ఫాంలను అందజేశారు.

- రవీంద్రభారతి, అక్టోబర్ 28